సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 12 । జనవరి । 2023



క్యాలెండర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం అర్బన్: బలుసులమ్మవారి చిత్రంతో ప్రచురించిన విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్య నారాయణ బుధవారం ఆవిష్కరించారు.



వైభవంగా కలశాభిషేకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక జనార్థన స్వామి దేవస్థానంలో తిరుప్పావై నిర్వహించారు. ఆండాళ్, తాయార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు.

పంచామృతాభిషేకం

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవిలో స్వామివారికి బుధవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



న్యూస్‌రీల్

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ

భీమవరం (ప్రకాశంచౌక్): స్త్రీ,శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి బుధవారం స్థానిక కలెక్టరేట్ డీఆర్‌ఓ చాంబర్‌లో ఇన్‌చార్జి డీఆర్‌ఓ దాసిరాజు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీలలో ఖాళీగా ఉన్న 8 వర్కర్స్ పోస్టులకు 28 మంది, 37 మంది హెల్పర్స్‌కు 109 మంది, 2 మినీ అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులకు ఒక్కరు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. అంగన్‌వాడి వర్కర్‌కు రూ.11,500, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7,000, మినీ అంగన్వాడి వర్కర్‌కు రూ.7,000 చొప్పున ప్రతి నెలా గౌరవ వేతనం చెల్లిస్తారు. అంగన్‌వాడి వర్కర్ల పోస్టులు విస్సాకోడేరు ప్రాజెక్టు పరిధిలో 6, నల్లజర్ల ప్రాజెక్టు పరిధిలో రెండు, హెల్పర్స్ ఆకివీడు-10, విస్సాకోడేరు-18, గణపవరం-4, నల్లజర్ల -5, మినీ అంగన్‌వాడి వర్కర్లు ఆకివీడు-1, విస్సాకోడేరు-1 ప్రాజెక్టుల పరిధిలో పోస్టుల భర్తీకి ఈ రోజు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

హాకీ పోటీలకు ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన వీరేశ్‌కుమార్

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి జూనియర్ హాకీ పోటీలకు భీమవరం విష్ణు కళాశాలకు చెందిన జీ.వీరేశ్‌కుమార్ ఎంపికై నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 3న భీమవరం భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో నిర్వహించిన సెలక్షన్స్‌లో ఎంపిక జరిగిందన్నారు. ఈ నెల 14వ తేది నుంచి మూడు రోజులపాటు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరేశ్‌కుమార్ పాల్గొంటాడని శ్రీనివాసరావు వివరించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ



ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా రూ. లక్ష అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణ ప్రజల ఇలవేల్పు మావుళ్ళమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఎల్లప్పుడు ఉంటాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన అక్కిరెడ్డి జయలక్ష్మి పేరున ఆమె మనుమరాలు ప్రియాంక మౌని మావుళ్లమ్మ నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా అందచేశారు. చిన్నతనంలోనే ప్రియాంకమౌని సేవాకార్యక్రమాలకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మౌని తల్లిదండ్రులు అక్కిరెడ్డి ఆదిలక్ష్మి, సీతారాం, ఆలయ కమిటీ చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, కామన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పండుగ స్పెషల్

- హైదరాబాద్ నుంచి జిల్లాకు 105 బస్సు సర్వీసులు
- సాధారణ చార్జీలకే ఆర్టీసీ ప్రయాణం
- పండుగ తర్వాత 84 సర్వీసులు
- 90 శాతం రిజర్వేషన్లు పూర్తి



భీమవరం (ప్రకాశంచౌక్): సంక్రాంతికి నగరం మొత్తం పల్లెబాట పట్టింది. దీంతో హైదరాబాద్ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చే జనాల్ని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసుల్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక బస్సులను నడుపుతుంది. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన పండగ ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నుంచి జిల్లాల్లోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నర్సాపురం డిపోలకు నడుస్తాయి. ఈ నెల 10 నుంచి హైదరాబాద్ నుంచి ప్రయాణికుల సంఖ్య పెరిగింది. హైదారాబాద్ నుంచి జిల్లాకు ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సులు దాదాపు కిక్కిరిసి ఉంటున్నాయి.

105 ప్రత్యేక బస్సులు ఏర్పాటు

హైదారాబాద్ నుంచి జిల్లాలో పలు ప్రాంతాలకు పండుగకు వచ్చే ప్రయాణికులను తీసుకురావడానికి ఆర్టీసీ 105 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతోంది. గతేడాది మాదిరిగానే సాధారణ ధరలకే ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. సూపర్ లగ్జరీ టిక్కెట్ రూ.750, ఇంద్ర రూ.950, అల్ట్రా రూ.710 చొప్పున వసూలు చేస్తున్నారు. రిజర్వేషన్ కూడా 90 శాతం మేర పూర్తయ్యింది.

ప్రత్యేక బస్సులు డిపోల వారీగా..

భీమవరం	32	తాడేపల్లిగూడెం	17
తణుకు	28	నర్సాపురం	28

తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు

తిరుగు ప్రయాణం కోసం ఈ నెల 16 నుంచి 20 వరకు 84 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు.

డిపోల వారీగా బస్సులు

భీమవరం	24	తాడేపల్లిగూడెం	11
తణుకు	25	నర్సాపురం	24

బస్సుల సంఖ్య పెంచుతాం



సంక్రాంతి పండుగకు ముందు, తర్వాత కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నాం. పండగకు ముందు 105, పండగ తర్వాత తిరుగు ప్రయాణానికి 84 ప్రత్యేక బస్సులు తిప్పుతాం. ప్రయాణికుల రద్దీ మేరకు బస్సుల సంఖ్య పెంచుతాం. టిక్కెట్ చార్జీ పెంచకుండా సాధారణ చార్జీలకే సర్వీసులు నడుపుతున్నాం. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చు. పండగకు ప్రజలు ఆర్టీసి బస్సులల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– ఏ.వీరయ్య చౌదరి, ప్రజా రవాణా అధికారి, భీమవరం

చిరు వ్యాపారులకు రూ.14.18 కోట్ల సాయం



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందచేస్తున్న జేసీ మురళీ

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న తోడు ఆరో విడత కార్యక్రమం కింద జిల్లాలో 14,180 మంది చిరు వ్యాపారులకు రూ.14.18 కోట్లు, గతంలో రుణాలు తీసుకొని బ్యాంకులకు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రియింబర్స్‌మెంట్ కింద 33,197మందికి రూ.86,45,820లు చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న తోడును సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ జేవీ మురళి మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో 1,607 మంది చిరువ్యాపారులకు రూ.1.60 కోట్లు భీమవరంలో 2,504 మందికి రూ.2.50 కోట్లు, పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించి 1,878 మందికి రూ.1.87 కోట్లు, నరసాపురంలో 1719 మందికి రూ.1.71 కోట్లు, తణుకు నియోజకవర్గానికి సంబంధించి 2,266 మందికి రూ.2.26 కోట్లు తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి 2,229 మంది లబ్ధిదారులకు రూ.2.22 కోట్లు, ఉండి నియోజకవర్గానికి సంబంధించి 1977 మంది లబ్ధిదారులకు రూ.1.97 కోట్లు అందజేశామన్నారు.

బ్యాంకు ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ

గతంలో రుణాలు పొంది బ్యాంకులకు సక్రమంగా చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ రాయితీ కింద ఆచంట నియోజకవర్గంలో 4469 మందికి రూ.11,18,339౹ భీమవరం నియోజకవర్గంలోని 5029 మందికి రూ.12,82,584, నరసాపురం నియోజకవర్గంలోని 3572 మందికి రూ.9,53,091, పాలకొల్లు నియోజకవర్గంలో 4187 మందికి రూ.10,71,830, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి 4383 మందికి రూ.12,01,704, తణుకు నియోజకవర్గానికి సంబంధించి 5458 మందికి రూ.13,89,437, ఉండి నియోజకవర్గానికి సంబంధించి 6097 మంది లబ్ధిదారులకు రూ.16,28,833 మొత్తం జమ చేశామన్నారు.

యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలి

మంత్రి కారుమూరి



బాస్కెట్‌బాల్ ఆడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడాపోటీల్లో పాల్గొని తమ సత్తా చూపించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీలను మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. యువత కోడిపందేలు, గుండాట తదితర జూదపు ఆటలకు ప్రాధాన్యతనివ్వకుండా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 6 నుంచి క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ తదితర వ్యాయామ క్రీడలు నిర్వహించడాన్ని స్వాగతించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

చినవెంకన్న బంగారం.. బ్యాంకులో భద్రం



శ్రీవారి బంగారాన్ని బ్యాంకు అధికారులకు అందజేస్తున్న ఆలయ ఈవో, (అంతరచిత్రం) స్వామి వారి బంగారం

ద్వారకాతిరుమల: శ్రీవారికి భక్తుల నుంచి హుండీలు, కానుకల ద్వారా లభించిన బంగారాన్ని దేవస్థానం అధికారులు గోల్డ్ బాండ్ స్కీమ్ కింద విజయవాడలోని భారతీయ స్టేట్‌బ్యాంక్‌లో బుధవారం డిపాజిట్ చేశారు. ఆలయ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన బంగారాన్ని ముందుగా దేవదాయ శాఖ మల్టీజోన్-1 రాజమండ్రి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి దుర్గాభవాని, శ్రీవారి ఆలయ ద్వితీయ ప్రధానార్చకులు భాను, ఈఓ వేంద్ర త్రినాథరావుల సమక్షంలో బయటకు తీసి, తూకం వేశారు. అనంతరం 7.339 కేజీల బంగారాన్ని గోల్డ్ బాండ్‌స్కీమ్ కింద ఎస్‌బీఐ (విజయవాడ) అధికారులకు అప్పగించారు. నిరుపయోగంగా ఉన్న 342 కేజీల వెండి వస్తువులను ఒక ట్రంకు పెట్టెలో పెట్టి సీలు వేశారు. ఈ వెండి వస్తువులను ఈనెల 18న హైదరాబాద్‌లోని మింట్‌లో కరిగించనున్నట్టు ఈఓ త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, కేఎల్ఎస్ రాజు, సూపరింటెండెంట్‌లు రమణరాజు, వాసు తదితరులున్నారు.

సత్వర న్యాయం కోసం సంస్కరణలు

హోం మంత్రి తానేటి వనిత

ఆగిరిపల్లి: ప్రజలకు సత్వర న్యాయం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో సంస్కరణలు తీసుకొచ్చిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని ఆగిరిపల్లిలో ఆధునిక హంగులతో నిర్మించిన ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను హోంమంత్రి వనిత, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిని పలకరించి వారితో మాట్లాడటానికి రిసెప్షన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వెయిటింగ్ హాలు, మహిళా సిబ్బందికి ప్రత్యేక విశ్రాంతి గది, పోలీస్ స్టేషన్ భవనంపై సిబ్బందికి అదనపు విశ్రాంతి గదుల నిర్మాణం ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు రూ.5 లక్షల నిధులు, దాతలు ఇచ్చిన రూ.45 లక్షలతో పోలీసు స్టేషన్ నిర్మించడం అభినందనీయమన్నారు. దిశ యాప్‌ను ప్రవేశ పెట్టి మహిళలకు అన్ని వేళలా తోడుగా ఉంచారన్నారు.

ఘనంగా కూడార్రై మహోత్సవం





కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నివేదించిన నైవేద్యం, పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారికి చందన అలంకరణ

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరిలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూడార్రై మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అక్కారి అడిశల్ ప్రసాదాన్ని 108 గంగాళాలతో స్వామికి నివేదనగా సమర్పించారు. ఈ సందర్భంగా కూడార్రై ఉత్సవ విశేషాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు వివరించారు. తొలుత ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో గంగాళాలతో ప్రసాదాన్ని నివేదన చేసి ప్రత్యేక మంగళ నీరాజనం సమర్పించారు. శ్రీనివాసుడిని చందనంతో విశేషంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాళ్లకూరులో..

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయం భూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూడార్రై పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాయసం ప్రసాదాన్ని తయారు చేసి 1130 గిన్నెలతో స్వామి వారికి, అమ్మవార్లకు నివేదించారు. ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ఉదయం నుంచి అష్టోత్తర శతనామావళి పూజ, తిరుప్పావై సేవాకాలం నిర్వహించి ఆలయ అర్చకులు పాంచరాత్ర ఆగమం శ్రీవైష్ణవ సంప్రదాయములో పాశురములు, గానం చేశారు. దేవాలయంలో వివిధ రకాల పుష్పాలతో శంకు, చక్రం, నామములతో అలంకరణ చేశారు.

క్లుప్తంగా

ఈగల మందు తాగి వివాహిత ఆత్మహత్య


వనపర్తి దేవి (ఫైల్)

జంగారెడ్డిగూడెం: భార్యాభర్తల మధ్య తగాదాల నేపథ్యంలో మనస్తాపంతో భార్య ఈగలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం ఎ.పోలవరం గ్రామానికి చెందిన వనపర్తి సతీష్‌తో అదే గ్రామానికి చెందిన దేవి (20)కి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడు నెలల పాప ఉంది. బుధవారం ఉదయం సతీష్ కూలిపనికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సతీష్ పనికి వెళ్లిపోయాడు. గొడవ నేపథ్యంలో మనస్తాపం చెందిన దేవి ఈగలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దేవి అత్త నిర్మల గమనించి, కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే ఈ ఘటనపై దేవి సోదరి ఎ.పోలవరానికి చెందిన తమ్మిశెట్టి నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన చెల్లెలు దేవి, బావమరిది సతీష్‌ది ప్రేమ వివాహమని, అయితే సతీష్‌కు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉంటంతో వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఇటీవల ఫోన్ విషయమై గొడవ జరిగి తన చెల్లెలిని కొట్టాడని, దీంతో మనస్తాపం చెంది ఈగల మందు తాగిందని ఫిర్యాదులో పేర్కొంది. సతీష్ బలవంతంగా తన చెల్లితో మందు తాగించాడనే అనుమానం ఉందని, న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంప్రదాయ క్రీడల్లోనూ రాణించాలి

- రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


భోగి మంటను వెలిగిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ హోం మంత్రి సుచరిత

తణుకు టౌన్: సంప్రదాయ క్రీడలలో విద్యార్థులు రాణించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు లయన్స్ క్లబ్ ఆఫ్ స్వర్ణ, జిల్లా లయన్స్ కల్చరల్ చైర్మన్ వావిలాల సరళాదేవి, వెంకట రమేష్, మారుతీ కళాశాల, బెల్‌వెదర్ స్కూల్స్ ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అన్నారు. విద్యార్థులు కోడిపందేలు, గుండాట వంటి జూదాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు క్రీడలలో రాణించడం ద్వారా ఉన్నత భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తణుకు పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న వావిలాల సరళాదేవి దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరిని మారుతీ కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ పంకజాక్షన్, వైస్ గవర్నర్లు కాకరాల వేణుబాబు, మారుతీ కళాశాల చైర్మన్ ఎంవీవీ సత్యనారాయణ, డైరెక్టర్లు ప్రదీప్ కుమార్, నాగరాజు, కనకయ్య, స్వర్ణ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ముగ్గులు, వంట పోటీలు, గంగిరెద్దులు, కోలాటం, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బెల్‌వెదర్ స్కూల్‌లో..

తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలోని బెల్ వెదర్ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకలను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో భోగిమంటను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మాజీ హోమ్ మంత్రి మేకతోటి సుచరిత, స్కూల్ కరస్పాండెంట్ అద్దంకి విజయకుమార్, డైరెక్టర్ అద్దంకి దీపక్, రిషిక, ప్రిన్సిపాల్ వినీతా సామ్యూల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో...

తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి, భోగి మంటను వెలిగించారు. విద్యార్థులకు కోలాటం, ముగ్గులు, వంట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, పాలకవర్గ సభ్యులు చిట్టూరి రీనా సాయి, నందిగం కిషోర్, సుభాషిణి, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, ప్రిన్సిపాల్స్ కరుటూరి రామకృష్ణ, బీహెచ్ హిమబిందు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాల విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

తణుకు అర్బన్: ఆహార పదార్థాలు, కిరాణా తదితర వ్యాపారాలకు సంబంధించి అధికార యంత్రాంగం నిబంధనలు పాటిస్తూ వ్యాపారులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులతో మంత్రి కారుమూరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లు, విక్రయాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాటి తాలూకా వ్యవహారాలు సైతం ఎప్పటికప్పుడు వ్యాపారులతో చర్చిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా కల్తీ వ్యాపారానికి ఎట్టి పరిస్థితుల్లోను అవకాశం ఇవ్వకుండా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్.రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మాజేటి ప్రకాష్, కార్యదర్శి రాజేష్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు ఇంటి వీరన్న, వ్యాపారులు బోయిడి అన్నవరం, రంగస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీమావుళ్లమ్మ ఉత్సవాలు

- 26న ఆమని, 29న జేడీ చక్రవర్తికి సత్కారాలు
- ఉత్సవ కమిటీ వెల్లడి.. ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


భీమవరంలో మావుళ్లమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59వ జాతర మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం , ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 13న మధ్యాహ్నం అమ్మవారి గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారని, సాయంత్రం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 10న అన్నసమారాధన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది సుమారు రూ.90 లక్షల వ్యయంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 26న సినీ నటి ఆమనిని సువర్ణ కంఠాభరణంతో, 29న జేడీ చక్రవర్తిని సువర్ణ హస్తా కంకణంతో సత్కరిస్తామని చెప్పారు. అలాగే ప్రతి ఏడాది మాదిరిగానే 21 పౌరాణిక నాటకాలు, 3 బుర్రకథలు, 6 హరికథలు, 6 సంగీత విభావరి, 9 మ్యూజికల్ నైట్స్, 15 కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

2 నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు

ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. 2న ఆదిలక్ష్మి, 3న ధాన్యలక్ష్మి, 4న ధైర్యలక్ష్మి, 5న గజలక్ష్మి, 6న సంతాన లక్ష్మి, 7న విజయలక్ష్మి, 8న విద్యాలక్ష్మి, 9న ధనలక్ష్మి, 10న అన్నపూర్ణ దేవిగా అలంకరణ చేయనున్నారు. అనంతరం ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు కాగిత వీర మహంకాళీరావు, తుటారపు ఏడుకొండలు, గన్నాబత్తుల సత్యనారాయణ, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్తిబాబు, రామాయణం సత్యనారాయణ, కొప్పుల రంగారావు, మానే భాస్కరరావు, కట్టా కొండ, రామాయణం శ్రీనివాసరావు, భాస్కరరావు, మానే తేజ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్ : చినతాడేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


పోడూరు: వద్దిపర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్

పథకాలపై హిజ్రాలకు అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి


హిజ్రాలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై హిజ్రాలు అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హిజ్రాలకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకాలు, హక్కులను సాధించడానికి హిజ్రాలు ముందుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా హిజ్రాలకు అవసరమైన న్యాయ సలహాలను ఉచితంగా అందిస్తామన్నారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ సమాజంలో పుట్టిన ప్రతి వ్యక్తి రాజ్యాంగానికి లోబడి జీవించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి హిజ్రా ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఇంటి స్థల సమస్యలు, రేషన్, ఆధార్ కార్డు సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఏలూరు డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు మాట్లాడుతూ గతంతో పోలిస్తే హిజ్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు శాఖాపరంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాయన్నారు. హిజ్రాలు చట్టానికి లోబడి వారి జీవితాన్ని కొనసాగించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ నీలకంఠ ప్రధానో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎస్ మునేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, హిజ్రా ప్రతినిధి చంద్రిక, డీఆర్‌డీఏ ఏపీఓ ఎన్‌వీ సూర్యకుమారి, ఐసీడీఎస్ పీడీ కేపీవీఎల్ పద్మావతి, ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీషా, హౌసింగ్ ఏఈ ఎండీ గౌస్ పాషా, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ సీహెచ్‌కే మహాలక్ష్మి పాల్గొన్నారు.

19 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


దొంగరావిపాలెంలో పట్టుబడిన రేషన్ బియ్యం

పెనుగొండ: అక్రమంగా భారీగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టివేశారు. దొంగరావిపాలెం వద్ద సివిల్ సప్లయ్ అధికారులు, రెవెన్యూ, విజిలెన్స్, రవాణా శాఖాధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 19 టన్నుల 380 బస్తాల బియ్యం అక్రమ రవాణాను గుర్తించి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం విలువ రూ.3.42 లక్షలు కాగా, సీజ్ చేసిన వాహనం ధర రూ.28.42 లక్షలు ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఈ బియ్యాన్ని విజయవాడ నుంచి మండపేటకు అక్రమ రవాణా అవుతున్నట్లు వివరించారు. విజయవాడలో బొప్పన సాయి అనే వ్యక్తి రేషన్ బియాన్ని తక్కువ ధరకు సేకరించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో బొప్పన సాయి వాహన యజమాని ఎం.నిర్మలప్రభు అక్రమ రవాణాకు సంబంధం ఉన్న వారిపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి ఎ.శ్రీధర్, ఎస్సై రంజిత్ కుమార్, ఏఎల్‌వీఐ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

గోనెపాడులో 3 క్వింటాళ్ల స్వాధీనం

కైకలూరు: చేపల చెరువుల్లో మేత కోసం ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై చల్లా కృష్ణ బుధవారం చెప్పారు. ఆకివీడు మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన వెలగెట్ల జనార్దన్ కైకలూరు సమీప ప్రాంతాల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తరలిస్తుండగా కైకలూరు మండలం గోనెపాడు వద్ద అడ్డుకున్నామన్నారు. అద్దెకు తీసుకున్న ఆటోలో వీటిని తరలిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. కైకలూరు సీఎస్ డీటీకి బియ్యం అప్పగించి జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శశిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శశి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన విద్యార్థులు, యాజమాన్యం

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం-03 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. సంస్థ అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యాసంస్థను 2000లో ప్రారంభించామని, ఇక్కడ విద్యాభ్యాసం చేసి దేశవిదేశాలలో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడటం చాలా ఆనందంగా ఉందన్నారు. నాటి నుంచి నేటి వరకు క్రమశిక్షణకే ప్రాధాన్యమిచ్చామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మనం ఏ స్థాయిలో ఉన్నా ఒకప్పటి విద్యార్థులమేనని, విద్యాభ్యాసం చేసిన కళాశాల, అధ్యాపకులను మరువరాదన్నారు. అధ్యాపకుల దృష్టిలో విద్యార్థులందరూ సమానమేనని, విద్యార్థుల ప్రస్తుత స్థాయిని బట్టి తారతమ్యాలు ఉండవన్నారు. పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధి కోసం తమ వంతు తోడ్పడాలన్నారు. పూర్వ విద్యార్థులు కళాశాల రోజుల్ని గుర్తుకుతెచ్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డైరెక్టర్ కె.భానుప్రసాద్ పాల్గొన్నారు.

డీజీగా పదోన్నతితో బాధ్యత పెరిగింది



చింతలపూడి ఎయిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీ పీవీ సునీల్ కుమార్

చింతలపూడి: డీజీగా పదోన్నతితో తన బాధ్యతను మరింత పెంచిందని ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం చింతలపూడి విచ్చేసిన సునీల్ కుమార్‌కు అంబేడ్కర్ మిషన్ (ఎయిమ్) ఆధ్వర్యంలో స్వాగతం పలకగా, పాత బస్టాండ్ సెంటర్ వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సునీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎయిమ్ నేతృత్వంలో ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీ హోదాలో చింతలపూడి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభ కలిగిన యువతకు ఎయిమ్ అపన్నహస్తం అందిస్తుందన్నారు. పేద విద్యార్థులు, యువతకు చేయూత ఇవ్వడం ఎయిమ్ స్థాపన ఉద్దేశమన్నారు. కష్టపడి చదివి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. రూ.10 లక్షల వ్యయంతో చింతలపూడి, అమలాపురంలో ఉచిత కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్ జిల్లా నాయకులు కాకర్ల సత్యన్నారాయణ, ఎయిమ్ రాష్ట్ర నాయకులు మాదిరి రాంబాబు, రిటైర్డ్ అడిషినల్ డీజీ పూరేటి విజయానంద్, రోహిత్ శౌర్య, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, లేబర్ బోర్డ్ వైస్ చైర్మన్ దయ్యాల నవీన్‌బాబు, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, నగర పంచాయితీ కమిషనర్ ఎస్.రాంబాబు, ఎస్ఎస్ రాజేంద్ర, కంచర్ల బుచ్చిబాబు పాల్గొన్నారు.

నాటకాలతో సామాజిక రుగ్మతలు దూరం

భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్‌బాబు

వీరవాసరం: నాటకాల ద్వారా సమాజంలో రుగ్మతలను రూపుమాపవచ్చని భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్‌బాబు అన్నారు. బుధవారం రాయకుదురులో శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కొండమంచిలి మందులు కళాప్రాంగణంలో గోగేటి పాపారావు కళావేదికపై జాతీయ స్థాయి నాటక పోటీలను డీఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా రంగం మనిషిని పెద్దదిగా చూపిస్తే, టీవీ రంగం చిన్నదిగా చూపిస్తోందని, నాటక రంగం మాత్రమే మనిషిని మనిషిగా చూపిస్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నాటక రంగం సమాజానికి ఎంతో మేలు చేస్తోందన్నారు. అటువంటి నాటక రంగాన్ని, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. సీఐ సీహెచ్ నాగ ప్రసాద్, కె.శ్రీనివాసకుమార్, గూడూరి ఓంకారం, పోలిశెట్టి సత్యనారాయణ, కోటిపల్లి బాబు, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, జి.మల్లేశ్వరరావు, గెడ్డం భారతి, గెడ్డం భాస్కరరావు, మల్లు రామకృష్ణ, ఎస్సై పి.రమేష్, కొడమంచిలి ప్రసాద్, గోటేటి ప్రసాద్ పాల్గొన్నారు. తొలిరోజు ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా, రౌతు నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

నాన్నా.. నేనొచ్చేస్తా

ఈనాటి మాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వరకూ పిల్లలు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చుకుంటూ పోతున్నారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకుని, పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం పెళ్లైన కొంతకాలానికే వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి «నాన్నా - నేనొచ్చేస్తా» అంటూ ప్రయాణం చేస్తున్న సుధలాంటి అమ్మాయికి భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షలకు దృశ్యరూపమే ఈ «నాన్నా - నేనొచ్చేస్తా» నాటిక. ఈ నాటికకు రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం ఆర్ఎస్ఆర్ నాయక్ వహించారు.

ఆలోచింపచేసిన 'రౌతు'

మనసు కల్లు తాగిన కోతిలాంటింది. కళ్లెంలేని గుర్రం లాంటిది అంటారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యాలనే ఆరుగురు దొంగలు మనసులో పుట్టి మనలోని జ్ఞాన సంపదను దోచుకునేందుకు సమయం కోసం ఎదురుచూస్తుంటారు. మనసులో పుట్టే చెడు కోరికలను విచక్షణ ద్వారా విచారించి మొగ్గలోనే తుంచెయ్యాలంటూ «రౌతు» నాటిక సాగింది. ఈ నాటికకు రచన జీబీకే మూర్తి, దర్శకత్వం సుధ వహించారు.

పేకాట శిబిరంపై దాడి

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్‌లోని ఒక ఇంట్లో పేకాడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్సైలు పి.అప్పారావు, వి.రాంబాబు బుధవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.65,747 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

మేత బస్తాల చోరీ

భీమవరం అర్బన్: తన చేపల చెరువు వద్ద మేత బస్తాలు దొంగిలించారంటూ ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. నాగిడిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని సోంబాబుకు చెందిన చెరువు వద్ద నిల్వ చేసిన 48 మేత బస్తాలను గత నెల 27న దొంగిలించారని, వాటి విలువ రూ.70 వేలు ఉంటుందని సోంబాబు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు మరోసారి తన దాతృత్వాన్ని చాటారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబానికి తక్షణమే ఆదుకుని వారికి భరోసా కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బింకం నరశింహారావు కుటుంబాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించి తక్షణ సహాయంగా రూ. 15వేలు, నిత్యావసర సరుకులు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ మంతెన సీతారామ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దారాబత్తుల రామాంజనేయులు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావం కలిగి ఉండండి



హోమియోపతి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఉమర్ ఆలీషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పట్టణంలోని గూడెం శాఖ కార్యాలయంలో హోమియోపతి క్లినిక్‌ను ఆలీషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సందేశం అక్కడ హాజరైన భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో తంగెళ్ళ త్రిమూర్తులు, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, గంధం వెంకట రమణారావు, సుజాత, అడబాల నారాయణ మూర్తి, కరిబండి రామకృష్ణ, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయం



చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న లియో సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని లార్డ్స్ ఆఫ్ లైఫ్‌లో లియో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాధురి, సంపత్‌లు ఆధ్వర్యంలో బుధవారం పలు సేవలను నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో కప్పిశెట్టి రమణయ్య, సుష్మిత, రేవతి వర్మ, లియో సభ్యులు ప్రమీల, అమృత, శివ, సాయి, శృతి, కార్తీక, గణేష్, నందిని, సంతోష్, ఇందిర, ఆంజనేయస్వామి, లయన్స్‌క్లబ్ డైమండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి



లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం తదితరులు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో బుధవారం లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ లాల్‌బహదూర్‌శాస్త్రీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆకెళ్ల వెంకటనాగ వరప్రసాద్, పీడీ ఎస్. రాజేష్, విగ్రహప్రతిష్ట చేసిన వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

పెంటపాడు: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెంటపాడు మండల తహసీల్ద్రార్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు, పింఛన్ ఇవ్వాలని, సీనియర్‌లకు ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. సీఐటీయు నాయకులు శిరపరపు రంగారావు, సీపీఎం కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు, పెనగంటి దుర్గ తదితరులతో పాటు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చినతాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



చినతాడేపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని చినతాడేపల్లి,కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందన్నారు. ఇప్పటికే ప్రజలికిచ్చిన హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి పథకాలు అందని వారుంటే వారికి సైతం సంక్షేమ పథకాలు అందించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమర్థవంతమైన ప్రభుత్వం, నాయకుడు ఉన్నప్పుడే ఇటువంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలు ఏ పార్టీకి ఓటేశారనేది చూడకుండా పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. టీడీపీకి చెందిన వారు సైతం ప్రభుత్వ పథకాలు అందాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం జగన్ నాయకత్వాన్ని బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత టీడీపీ ఐదేళ్ల పాలనలో ఇష్టం వచ్చినట్లుగా దోచేశారన్నారు. జగన్ అందిస్తున్న పాలనను చూసి చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. పవన్, చంద్రబాబులది దుర్మార్గమైన కలయిక అని పేర్కొన్నారు. చంద్రబాబు అవసరానికి వాడుకుని వదిలేసే వ్యక్తి అని విమర్శించారు. అనంతరం గ్రామంలో కొత్తగా మంజూరైన ఇద్దరు పింఛన్‌దారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తేవడంతో వాటిని తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామంలో రూ.20లక్షలు వ్యయంతో 440 మీటర్లు పొడవునా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఆర్ఐ కె.శివప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజాశ్రీనివాస్, పీఆర్ ఏఈ జి.పవన్, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, దూలపల్లి సత్తియ్య, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, గుల్లపల్లి ధర్మరాజు, మండల మహిళా సమాఖ్య కొల్లా విజయలక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పాతూరులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుంచి పల్లకి మహోత్సవం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని పాతూరులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నుంచి పరిసర ప్రాంతాల్లో బుధవారం వైభవంగా పల్లకి మహోత్సవం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో తొలుత అర్చకులు సుందర రామానుజాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్టు బోర్డు కమిటీ అధ్యక్షుడు కె.శ్రీను, సభ్యులు పెనుగొండ సత్యవతి, ఆంజనేయులు, చామన ప్రసాద్, ఆలం పార్వతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం!

- అడుగడుగునా జన నీరాజనం
- 2వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు సంక్షేమ బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ రాజ్యం నడుస్తోందని, సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 2వ వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రతి గడపలోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ సొంత బిడ్డలా చూసుకుంటున్నారని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళాపక్షపాతిగా సంక్షేమ లబ్ధిని మహిళల బ్యాంకు ఖాతాలకు జమచేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, దేశ చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి కారుమూరికి హారతులు పట్టి స్వాగతం పలికారు. స్థానిక నెలకొన్న పలు సమస్యలను మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ (పీబీఆర్), రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, 2వ వార్డు నాయకులు సంగిరెడ్డి శ్రీనివాస్, రంభ నాగేశ్వరరావు, పెంట నరేష్, రంభ సత్యచైతన్య, పంపన సుబ్బారావు, షేక్ మస్తాన్, కర్రి గంగాధర అప్పారావు, షేక్ బాజీ, సామంతుల అప్పారావు, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



భవిత కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

అత్తిలి: మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగ శోభను నేటి తరానికి తెలియజేయడం కోసం పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత కేంద్రంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా భవిత విద్యార్థులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.జ్యోతి, విలీన ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకులంలో సంక్రాంతి సంబరాలు



తాడేపల్లిగూడెం మండలంలో గురుకుల విద్యాలయంలో సంబరాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డా. బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తొలుత ప్రిన్సిపల్ బి.రాజారావు భోగి మంటలు వెలిగించి సంక్రాంతి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసులు, బుడగ జంగాళ్ళు, కొమ్మదాసరి, సన్నాయి వాయిద్యకారుల వేషధారణలో ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న తణుకు సీఐ ఆంజనేయులు

అత్తిలి: యువత క్రీడల్లో రాణించాలని తణుకు సీఐ ఆంజనేయులు అన్నారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం యంగ్ పవర్‌స్టార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురష్కరించుకుని కోడిపందేలు, జూద క్రీడలు జోలికి వెళ్లకుండా మన సాంప్రదాయ క్రీడా, ఆటల పోటీలను నిర్వహించుకుని, ఆనందంగా పండుగను జరుపుకోవాలన్నారు. కోడిపందేలు, జూద క్రీడల వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్ర ఆర్థికంగా నష్టపోతున్నాయని, ఈ విధానాన్ని యువత విడనాడాలన్నారు. టోర్నమెంట్‌కు పోలీసుశాఖ తరపున తమ సహకారం ఉంటుందని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ. 20వేలు, ద్వితీయ బహుమతి రూ. 10వేలుగా నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులు సీఐ ఆంజనేయులు, ఎస్సై స్వామిలకు జ్ఞాపికలు అందజేసారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రేమజ్యోతి, పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలోని అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. శ్వేతార్క పుష్పాలతో పూజ, వ్రత కథ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు నేతృత్వం వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బలుసులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆలయ కమిటీ ముద్రించిన బలుసులమ్మ దేవస్థానం క్యాలెండర్‌ను బుధవారం మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొట్టు అంజిబాబు, సభ్యులు పెదప్రోలు భాస్కర్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని రాచర్ల గ్రామశివారులో పేకాట శిబిరాల పై పెంటపాడు పోలీసులు బుధవారం దాడులు చేసారు. ఈ సందర్భంగా ఎస్సై జి. సత్యనారాయణ పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 4200 స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

మంత్రి పరామర్శ



పేకేరులో ద్వారంపూడి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల,శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. పేకేరు గ్రామానికి చెందిన ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, తల్లి వెంకయ్యమ్మ ఇటీవల మృతి చెందడం జరిగింది. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. వెంకయ్యమ్మ కుటుంబానికి అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అలాగే అయితంపూడి గ్రామనికి చెందిన ఉప్పులూరి జితేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదనికి గురైయ్యారు. ఆయనతో మాట్లాడి త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తూన్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పి శెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకునేందుకు ధర్మపథంను పునరుద్ధరిస్తాం



శాసన సభ్యులు మల్లాది విష్ణుకు సత్కారం చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కళాకారులను ఆదుకునేందుకు ధర్మపథంను పునర్ధరిస్తామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో బుధవారం రాత్రి సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. లాటిన్ జీవే డాన్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన చిన్నారులు కార్తీకేయ, నిత్యశ్రీ మహాలక్ష్మిలకు కళాభినందన సత్కారం జరిగింది. అనంతరం విజయవాడ ఎమ్మెల్యే, ఏపీ ప్లానింగ్ కమీషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణుకు గౌరవ పురష్కారం అందజేశారు. సినీ నటీమణి అల్లరి సుభాషిణికు ఆర్థిక సత్కారం అందించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన కళాశాల చైర్మన్ ఎస్.రమా సత్యనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు హాజరైయారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఇరగవరం: వైఎస్సార్ సీపీ మహిళ విభాగం ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 14 గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని మండల వైఎస్సార్‌సీపీ మహిళ అధ్యక్షురాలు, రేలంగి ఎంపీటీసీ సభ్యురాలు మెట్ల కిరణ్మయి అన్నారు. బుధవారం గోటేరు గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి మాట్లాడారు. తెలుగు యువత సంప్రదాయాన్ని రంగ వల్లుల్లో నింపి పల్లెటూరులే దేశానికి పట్టుకొమ్మలని చూపెడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పిలుపు మేరకు కె.కుముదవల్లి, ఓగిడి, యర్రాయి చెరువు, తూర్పువిప్పర్రు, నారాయణపురం, కె.ఇల్లిందలపర్రు, కావలిపురం, అర్జునుడిపాలెం, కంతేరు, పొదలాడ, కాకిలేరు, కత్తవపాడు, గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీల్లో గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తునా పాల్గొన్నారు. అందులో మొదట మూడు స్థానాల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాళ్లు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, మండల యూత్ అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి కారుమూరి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మండలంలో మూడున్నరేళ్లలో రూ. 360కోట్లు అభివృద్ధి చేస్తే, అది ప్రతిపక్షాలకు కనిపించడంలేదా అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అత్తిలి పంచాయతీ వద్ద రూ. 2 లక్షలతో వంతెన తప్ప మరే అభివృద్ధి పనులు చేయలేదని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించడాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కళ్లులేని కబోదికి అభివృద్ధి కనిపించదన్నారు. టీడీపీ హయాంలో ఒక్కసెంటు భూమి పేదలకు పంచలేదని, తాము వచ్చాక అత్తిలిలో 37 ఎకరాలు కొనుగోలుచేసి, పేదలకు ఇళ్లపట్టాలు అందజేసామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాలికోన్నత పాఠశాలను కూల్చి మెటీరియల్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. సంక్షేమ కార్యక్రమాలకు అత్తిలి మండలంలో 261.90 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద రూ. 27.60 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నవారికి అభివృద్ధి కనిపించదన్నారు. ఇళ్ల స్థలాలు, అభివృద్ధి విషయంలో తాము చర్చకు సిద్ధమని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్ సవాల్ చేసారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైస్‌ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ కోరారు. బుధవారం ఆయన అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్యసమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడంలేదని గుమ్మంపాడు, లక్ష్మీనారాయణపురం ఎంపీటీసీలు అద్దంకి శ్రీను, ఆడారి శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉరదాళ్లపాలెంలో శ్మశాన భూమిని సర్వేచేయించాలని సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్ కోరారు. గుమ్మంపాడులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అత్తిలి మార్కెట్‌ప్రాంతంలో పోల్‌ను మార్చాలని, ఈడూరులో ట్రాన్స్‌పార్మర్‌ను మార్పుచేయాలని ఎంపీటీసీ సభ్యులు అద్దంకి శ్రీను, బుద్దాల రాంబాబు, సుంకర నాగేశ్వరరావు తెలిపారు. వరిఘేడులో ఉన్నత పాఠశాల స్థలం మెరక చేయించాలని ఎంపీటీసీ అనిశెట్టి త్రిమూర్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

శరవేగంగా జలజీవన్‌మిషన్ పథకం నిర్మాణ పనులు

అత్తిలి: మండలంలో జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి ఇరిగేషన్ కార్యాలయం వద్ద రూ. 27కోట్లతో నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్తిలి పట్టణంలో రూ. 6.75 కోట్లతో మంచినీటి సరఫరా పథకం నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ,సర్పంచ్ గంటా విజేత నాగరాజు , ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.